ప్రతీ ఆరు నెలలకు వైద్య శిబిరాలు



చిన్నారికి అన్నప్రాసన కార్యక్రమంలో ఎంపీపీ వాసురాజు, వైద్య బృందం



చిప్పాడలో లబ్ధిదారులకు మందులు, కేస్ షీట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

• ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్రంలో ఇకపై ప్రతీ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండలం చిప్పాడలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గురువారం ఆయన మాట్లాడారు. పంచాయతీలో 4 వేల జనాభా ఉంటే కేవలం 820 మందికే టోకెన్లు ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇంటింటికీ వైద్యం అందించే సదుద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తే ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా పనిచేసి ప్రజలకు సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యులను దేవుళ్లగా భావించే మన దేశంలోముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికే వైద్యులను పంపించి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. గతంలో సంక్షేమ పథకాల కోసం టీడీపీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు నాయకులు, అధికారులతో సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు శోభారాణి, దుర్గా కల్యాణి, గోవింద్, మహమ్మద్ కౌశర్, వైఎస్సార్ సీపీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ వెంపాడ రమావతి, సూరిబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సమ్మిడి శ్రీనివాసరావు, మేరుగు ఎల్లాజీ, చుక్క శివాజీ, సరగడ రాంబాబు, తోట ఎల్లారావు, గాడు తాతినాయుడు, పూసర్ల ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష'తో ప్రజల ముంగిటకే వైద్యం

పద్మనాభం: జగనన్న సురక్షతో ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్షతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ప్రతి ఆరు నెలలకోసారి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను సందర్శించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, నాయకులు ఈర్ల ఈశ్వరరావు, మొకర అప్పలనాయుడు, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు



కృష్ణాపురంలో పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

క్లుప్తంగా

నెల రోజుల్లో ఎస్సీ కాలనీకి తాగునీరు



చిప్పాడలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్ ఎస్సీ కాలనీకి నెల రోజుల్లో తాగునీరు ఇవ్వాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన చిప్పాడలో ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఆరోగ్య కేంద్రం వరకు రూ.13 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనుల శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య గురించి ఎస్సీ కాలనీ మహిళ అడగ్గా ఆయన స్పందించారు. కార్యక్రమంలో ఎలమంచిలి సూర్యనారాయణ, దంతులూరి వాసురాజు, బోని బంగారునాయుడు, గాడు శ్రీను, సరగడ రఘునాథరెడ్డి, వెంపాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



నారాయణమ్మకు బీమా సొమ్ము అందిస్తున్న సర్పంచ్ ఛాయాగౌతమి తదితరులు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో పోలిపల్లి నారాయణమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి తక్షణ సాయంగా రూ.10వేలతోపాటు తన వంతు సాయంగా మరో రూ.5వేలు అందించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా ఆమె భర్త పోలిపల్లి రామకృష్ణ మరణించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నారాయణమ్మ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, వార్డు సభ్యులు పద్మ, నరేంద్ర, సామాజికవేత్త వాండ్రాసి సతీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు పాల్గొన్నారు.

తర్లువాడ విద్యార్థులకు అభినందనలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన తర్లువాడ విద్యార్థులు

ఆనందపురం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న తర్లువాడ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫుట్‌బాల్‌లో ఎం.ఆదర్శ్, జి.బన్నీ, కె.యోచన, స్విమ్మింగ్‌లో ఎం.తరుణ్, బి.రాజు, అథ్లెటిక్స్‌లో ఎం.ఆదర్శ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం జ్యోతి, పీడీ పొన్నాడ మాధవరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

పద్మనాభం: విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం జరజాపుపేటలో అదృశ్యమైన వ్యక్తి మృతదేహం పద్మనాభం మండలం పాండ్రంగి సమీపంలోని గోస్తనీ నదిలో లభ్యమైనట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... జరజాపుపేట గ్రామానికి చెందిన బాయి సూర్యనారాయణ (64) ఈ నెల 3 నుంచి కనిపించడం లేదని నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సూర్యనారాయణ సొంత గ్రామమైన ఆనందపురం మండలం బోని వచ్చి మద్యం సేవించి సమీపంలోని గోస్తనీలో జారి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుని కుమారుడు దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఉత్సాహంగా జానపద నృత్య పోటీలు



ప్రశంసా పత్రాలతో గెలుపొందిన విద్యార్థినులు

భీమునిపట్నం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో జానపద నృత్యాలు, రోల్‌ప్లే పోటీలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో 25 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న విద్యార్థినుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించడానికి ఈ పోటీలు నిర్వహించామన్నారు. పోటీలతో వారిలో ఆత్మస్థైర్యం పెరగడంతోపాటు చదువులో కూడా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. ఇక్కడ గెలుపొందిన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జానపద నృత్యాల పోటీల్లో నడుపూరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. రోల్ ప్లే పోటీల్లో అనకాపల్లి జిల్లా అరిపాక ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



తర్లువాడలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలనే తలంపుతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తర్లువాడ పంచాయతీ పక్కుర్తివానిపాలెంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగన్ మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. టీడీపీ పాలనలో నాయకులు దోపిడీకి పాల్పడడంతో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయని చెప్పారు. దీనివల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని వివరించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని కొనియాడారు. తర్లువాడ పంచాయతీలో ఇంత వరకూ సంక్షేమ కార్యక్రమాలకు రూ.10 కోట్లు, అభివృద్ధికి రూ.4.5 కోట్లు ఖర్చు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను వివరించగా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీడీవో అడపా లవరాజు, మండల వైస్ ప్రెసిడెంట్ పాండ్రింకి శ్రీను, నాయకులు మజ్జి రమేష్ నాయుడు, బాలి అయ్యప్ప, కోరాడ అప్పలస్వామి నాయుడు, లెంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ఆనందపురం : ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి బ్యాంక్ అధికారులు బీమా చెక్కు గురువారం అందజేశారు. గండిగుండం ఎస్సీ కాలనీకి చెందిన వాకాడ సతీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సతీష్‌కు కొంత్యాం ఎస్‌బీఐలో ఖాతా ఉండగా ప్రమాద బీమా పాలసీ చేయించుకున్నాడు. రోడ్డు ప్రమాదంలో అతను మరణించగా ప్రమాద బీమా కింద రూ.10.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం స్థానిక సర్పంచ్ గంర్రెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా మృతుని తల్లి వాకాడ లక్ష్మికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఐ.ఫణి కొండలరావు, చీఫ్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, బీఎం ఏఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు డిమాండ్



ప్రసంగిస్తున్న మల్హారీ

పీఎం పాలెం: ఎంబీఏ, ఎంసీఏ విద్య అభ్యసించిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉందని ఆస్ట్రేలియాకు చెందిన అనాలసిస్ట్ మల్హారీ వైద్యుల అన్నారు. జీవీఎంసీ 8వ వార్డులో గల శ్రీనివాసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్‌లో) గురువారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆయా కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. మెరుగైన కమ్యూనికేషన్ స్కిల్స్‌తో విదేశాల్లో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చన్నారు. అంతకుముందు ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఎస్.రవీంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్ రామలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ లారెన్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వీధిలో సురక్ష సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు గ్రంథాలయ వీధిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. శిష్టకరణాల మహిళా సంఘం అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, తెడ్లాపు అప్పలరాజు, చిప్పాడ వెంకటేష్, శీరపు అప్పలరెడ్డి పాల్గొన్నారు.

మందుల వినియోగంపై కేంద్ర కమిటీ ఆరా



వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గురువారం ఇద్దరు వైద్యులతో కూడిన కేంద్ర పబ్లిక్ రిలేషన్స్ కమిటీ పర్యటించింది. కేరళకు చెందిన వైద్యులు సజిత, అనితకుమారి పంచాయతీలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వినియోగిస్తున్న మందుల గురించి ఆరా తీశారు. ఈ వివరాలతో నివేదిక తయారు చేస్తున్నట్టు చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవనరాణి, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ పల్లా నీలిమ, ఎస్‌వో మురళీకృష్ణ, ఈవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పార్కులో పాము కలకలం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు బీచ్ రోడ్డు సాగర్‌నగర్ పార్కులో గురువారం 7 అడుగుల కొండ చిలువ కలకలం రేపింది. ఇక్కడ కొబ్బరి చెట్టు పార్కు వద్ద సేద తీరేందుకు పలువురు పర్యాటకులు చేరుకున్నారు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం వద్ద 7 అడుగుల పాము కనిపించడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. కదలలేని స్థితిలో ఉన్న ఆ పామును పర్యాటకులు తమ ఫోన్లలో బంధించారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ హెలన్‌జాన్సన్

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని దొరతోట వద్ద నున్న నవజీవన్ జూనియర్ కళాశాల విద్యార్థులు గత రెండు రోజుల క్రితం జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారు. అండర్ – 19 విభాగంలో పలు పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం వీరిని ప్రిన్సిపాల్ హెలెన్ జాన్సన్ అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ శ్యామ్ థామస్, పీఈటీ సురేష్, నవజీవన్ స్కూల్ ప్రిన్సిపాల్ లియా ఎలిజిబెత్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



సరకులు అందిస్తున్న శ్రీనివాసరెడ్డి, తదితరులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేటలో బుధవారం అగ్ని ప్రమాదానికి గురైన సత్యశ్రీ సోఫా మరమ్మతుల దుకాణం యజమాని భగీరథ విజయ వర్ధన్ కుమార్‌రాజు, గౌరీ దుర్గా కామేశ్వరి దంపతులకు వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి నిత్యావసర సరకులు, బియ్యం గురువారం అందించారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కొయ్య గురయ్యరెడ్డి, మద్దిల సుబ్బారావు, అక్కరమాని చినబాబు, పందిరి విజయ్, రమాబాయి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 50 మంది ఎంపిక

తగరపువలస: స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 50 మంది ఎంపికయ్యారు. 200 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా జెన్‌పెక్, ఎక్సెంట్యూర్, టెక్ మహీంద్రా, కాన్సంట్రిక్స్, వరుణ్ మోటార్స్, పెప్సోల్, హెచ్ఎంఐ తదితర సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన హెచ్ఆర్‌లు వివిధ దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక పూర్తి చేశారు. ఎంపికైన అభ్యర్థులను శ్రీబాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ చొప్పా సురేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, ఏవో కేశవ అభినందించారు.

మధుర స్మృతులను తలచుకుంటూ...

• జోనల్ కార్యాలయాన్ని సందర్శించిన విశ్రాంత కమిషనర్



జోనల్ కార్యాలయంలో నర్సింహరావు కుటుంబ సభ్యులు

భీమునిపట్నం: ఆయన 48 సంవత్సరాల క్రితం ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. ఇన్ని సంవత్సరాల తర్వాత గురువారం తాను పనిచేసిన కార్యాలయాన్ని చూడడానికి విచ్చేశారు విశ్రాంత మున్సిపల్ కమిషనర్ నర్సింహరావు. ఆయన 1975 నుంచి 78 వరకు ఇక్కడ పని చేశారు. తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిపోయారు. ఇన్నేళ్ల తర్వాత తాను గతంలో పని చేసిన కార్యాలయాన్ని చూడడానికి కుటుంబ సభ్యులతో వచ్చారు. విషయం తెలుసుకున్న కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు సాదరంగా స్వాగతం పలికారు. అప్పట్లో ఆయన నివాసమున్న క్వార్టర్స్‌ను చూశారు. ఈ సందర్భంగా అప్పటి విషయాలను గుర్తు చేసుకున్న నర్సింహరావు భావోద్వేగానికి గురయ్యారు.

ప్రభుత్వ స్థలం రక్షించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు స్థానిక శ్రీ శివ శంకర సేవా సంఘం అధ్యక్షుడు యర్రా జోగారావు ఆధ్వర్యంలో పలువులు వినతిపత్రం ఇచ్చారు. విశాఖలో గల ఆయన నివాసంలో గురువారం కలిసి సమస్య వివరించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రిక్షాకాలనీ 1990లో ఏర్పడినప్పటి నుంచి 300 కుటుంబాల ప్రజలు నివసిస్తున్నారన్నారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరులో సుమారు 10 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీనిని తమ కాలనీతోపాటు ప్రశాంతినగర్, శ్రీవల్లినగర్, వైభవ్‌నగర్, వసంత విహార్, రేవళ్లపాలెం వాసులకు కల్యాణ మండపం నిర్మించాలని గతంలో కోరామన్నారు. సదరు స్థలంలో గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తీసేసి ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నట్టు వాపోయారు. సదరు స్థలాన్ని పరిరక్షించి కల్యాణ మండపం నిర్మించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ఆ స్థలం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వైఎస్సార్ సీపీ 6, 7వ వార్డుల అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, పార్టీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, రైల్వే బోర్డు సభ్యుడు ఎస్.బాబ్జీ, మూర్తిబాబు, సంఘ కార్యవర్గ సభ్యులు పోలిశెట్టి నాగేశ్వరరావు, ఉప్పిలి రాము, వి.సూర్యారావు, జేపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలి

భీమునిపట్నం: భీమిలి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. ఎంపీపీ దంతులూరి వాసురాజు అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాలుగా మండల పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కోసం రూ.370 కోట్లు ఖర్చు చేశామని, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ఇంకా అనేక పనులు జరుగుతున్నాయని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో రీ సర్వే సరిగ్గా జరగలేదని, మళ్లీ జాగ్రత్తగా పరిశీలించి సర్వే జరపాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను అందించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీడీవో వెంకటరమణ పాల్గొన్నారు.

శాలివాహన కార్యవర్గానికి సన్మానం



శాలివాహన కార్యవర్గ సభ్యులతో ప్రతినిధులు

తగరపువలస: జిల్లా శాలివాహన సంఘం నూతన కార్యవర్గంలో నియమితులైన జీవీఎంసీ రెండో వార్డు కుమ్మరవీధికి చెందిన ప్రతినిధులను వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి తదితరులు సన్మానించారు. జిల్లా శాలివాహన సంఘం నూతన అధ్యక్షునిగా సంతపేటకు చెందిన అరటికోట్ల వెంకటేష్, కోశాధికారిగా తాటిపూడి శ్రీనివాసరావు, భీమిలి మండల అధ్యక్షునిగా పెనుగుర్తి సన్యాసిరావు, కార్యదర్శిగా అరటికోట్ల రాంబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వీరిని శాలివాహన సంఘం ప్రతినిధులు కూడా సన్మానించారు. కార్యక్రమంలో సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, అమ్మిరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, పొట్నూరు రామచంద్రరావు, గుజ్జు రాము, గఫూర్, కొయ్య వెంకటలక్ష్మి, తమ్మిన శ్రీను, సూరిబాబు, గజపతిరాజు, డెక్కతి శ్రీను పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న శ్రీనివాసరావు

పద్మనాభం: మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అన్ని అంశాల్లో శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ బి.శ్రీనివాసరావు సూచించారు. పద్మనాభంలోని కస్తూర్బా విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీసీడీవో కాలేశా బేగం మాట్లాడుతూ సెలవు రోజుల్లో స్టడీ యాక్టివిటిస్, మెడిటేషన్ ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏపీసీ ఎఫ్ఏ-2 పరీక్షల పేపర్ల దిద్దుబాటును పరిశీలించి ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు చేరాలి



అవగాహన ఒప్పందాలతో అనిట్స్ ప్రతినిధులు

తగరపువలస: ప్రపంచంలో అతి వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేందుకు అందరూ కృషి చేయాలని ఎస్ఎస్‌టీఎల్ డైరెక్టర్, డీఆర్‌డీవో శాస్త్రవేత్త డాక్టర్ అబ్రహం వరుఘీష్ అన్నారు. గురువారం సంగివలస అనిట్స్‌లో ప్రారంభమైన ఐఈఈఈ ఎడ్యుకేషన్ సొసైటీ లీడర్‌షిప్ సమ్మిట్ - 2023లో ఆయన ప్రసంగించారు. ఇలాంటి వేదికలు నవకల్పనలు, నూతన పారిశ్రామిక ఆవిష్కరణలకు దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరామకృష్ణ మాట్లాడుతూ సమ్మిట్‌లో గూగుల్ మెషిన్ లెర్నింగ్, డిజైన్ థింకింగ్, కోడింగ్ కంటెస్ట్‌కు సంబంధించిన వర్కుషాపులు జరుగుతాయన్నారు. ఐఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జె.విజయకుమార్ మాట్లాడుతూ ఈ సమ్మిట్ ద్వారా సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఎక్స్‌ఎల్ఆర్, ఏఎంటీజెడ్ వంటి సంస్థలతో అవగాహన చేసుకున్నట్టు తెలిపారు. జాతీయ స్థాయిలో 30 కళాశాలలకు చెందిన విద్యార్థులు, అధ్యాపకులు సమ్మిట్‌లో పాల్గొన్నారు. చివరగా ఐఈఈఈ 75వ వార్షికోత్సవాలు జరుపుకున్నారు.

వెల్లంకి సచివాలయం పనితీరుపై అధ్యయనం



ఈశ్వరన్‌తో వెల్లంకి సచివాలయ సిబ్బంది

ఆనందపురం : మండలంలోని వెల్లంకి సచివాలయంలో వివిధ పథకాల అమలు తీరుపై ఐఎస్‌వో సర్టిఫికెట్ కోసం గురువారం అధ్యయనం చేశారు. ఈ మేరకు ఐఎస్‌వో ప్రతినిధిగా కేరళకు చెందిన ఈశ్వరన్ నంబూర్తి వెల్లంకి సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ రకాల సేవలపై అధ్యయనం చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించి వివరాలు సేకరించారు. పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి ఐఎస్‌వో సర్టిఫికెట్ కోసం సిఫార్సు చేస్తామని ఈశ్వరన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరావు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.